...రు నమః.

...గ్యమాధవము.

...జుల రామసుబ్బారాయుఁడు, బి. ఏ.,

ప్రెసిడెంటు:

...హాలతా కని తానంఘము,

...గొల్లాపురం.



...పెంటపాడు,

...ష్ణవ ముద్రాక్షరశాలయందు

ముద్రింపబడినది.

1933.

పీఠిక.

ఆరోగ్యమార్గ ప్రదర్శకులును, అస్మద్గురువర్యుల
కింకవీంద్రఘటాపంచాననులును నగు బ్రహ్మశ్రీ చెళ్లపిళ్ల వే
శాస్త్రిగారి 'ఆరోగ్యకామేశ్వరి' యను గ్రంథము నను
చియే, యీ 'ఆరోగ్యమాధవము' నా రెండవ కుమా
డగు సుబ్రహ్మణ్యము రోగార్తిచేఁ దపించు సమయ
నారోగ్యార్థమై మాధవునుద్దేశించి స్తుతిచేయఁబడిన
గ్రంథము. ఇట్టి విపత్సమయమున వేఱుమార్గములయ
నాకు విశ్వాసము లేక కేవలము దైవతారాధనయందు
గల భక్తియును, నా గురువర్యుని మార్గమవలంభించుట
దనురక్తియును నన్నుఁ బ్రేరేపింపఁ దొలుదొల్త వ్రాయఁ
'శనిస్తోత్ర' 'ఆరోగ్యవేంకటేశ్వర రాజరాజేశ్వరీ'
ముల తెలుంగుననే యీ గ్రంథమును రచించినాఁడను.

లీలావతారుండగు పరమేశ్వరునిచే గల్పింపఁబడిన
మాయామేయ జగన్నాటకరంగమందు తమతమపాత్రలని
సంపూర్ణముగ చిత్రింపవలసిన భారము ప్రతి మానవునికి
ధర్మమైనను, ఏతన్నిర్వాహణమును, పరిణామదశయుఁ
విధిననుసరించియే యుండునని విజ్ఞులెఱింగిన విషయమే
విశేషించి వ్రాయక నింతటితో విరమించుచున్నాఁడను.

ఇట్లు,

శ్రీమత్పరదేవతాయై నమః.

ఆరోగ్యమాధవము.

మ. ఇదె నాప్రార్థన నాదు రెండవసుతుండెంతో రుజాక్రాంతుఁడై
పడలోనుండుటఁ జేసి, వైద్యులయెడన్ ప్రామాణ్యమా? లేదు; నె
మ్మదిని ధైర్యంబొకయింత లేదు, బ్రదుకన్ మార్గమ్ము లేదింక నీ
పదపద్మంబులె నాకు దిక్కు కరుణాపారీణ! యోమాధవా! 1

సీ. ఆనాఁడు ప్రసవవేదానలజ్వాలచే
మద్భార్య తపియింప మనుపలేదె?
ఆనాఁడు దీర్ఘరోగార్తిచేఁ గృశియించు
నా జ్యేష్ఠసుతు దయన్ గావలేదె?
ఆనాఁడు క్షీణించి ప్రాణాశవీడిన
పట్ల నన్నట్లు గాపాడలేదె?
ఈనాఁడు దుర్భరమైన బాధల జిక్కు
టఁ గలిగె నాదు రెండవ సుతుండు,
గీ. బ్రతుకఁ గలఁడంచు నాశయు వదలిపోయె
విసిగిపోతి నౌషధముల వేసి వేసి
కడకు నీవ దిక్కనుచు నీగాళ్ళఁ బడితి
కరుణఁ బ్రోవుమా మత్సుతుఁ గమలనాభ! 2

మ. పాపం బొక్కెడఁ దాను జేసినను గాపాడంగ రాదొక్కొ? న
న్నే పీడింపఁగఁ జేయఁగాఁ దగును జుమ్మీ! జాలమింకేల? ఏ
పాపంబుండదటంచు నీచరణమే ప్రాపంచు నేఁ బట్టితిన్
పాపం బాపఁగఁ జేసి కుఱ్ఱనికి మోదంబిమ్ము యోమాధవా! 3

సీ. ప్రహ్లాదుఁడానాఁడు పడెడు బాధలఁ జూచి
దయఁదాల్చి దరిఁజేర్చి దనుపలేదె ?
మత్తేభమానాఁడు మకరి కోఱలఁ జిక్క
శరణిచ్చి ప్రోవవే భరముమాన్పి,
పతి శాపవశమున స్మృతిదప్పి పతితయై
న పడతిఁగావవే నయముసూపి,
ధార్తరాష్ట్రులబారి దప్పించి కావవే?
ద్రౌపది నెంతేసి దయదలిర్ప,
గీ. వీరువారని యెంచ కెవ్వారినైన
నీ పదారవిందముల సన్నియతిఁ దాల్చి
భజన చేసిన యంతఁ గాపాడ వొక్కొ ?
భారమానె మత్సుతుఁ బ్రోవ నీరజాక్ష ! 4

శా. ఎన్నో మందులువాడిచూచితిని నేనన్నాళ్ళ మేల్ వైద్యుల
న్నెన్నో భంగులయత్నమూనిరవియున్ హీనంబులయ్యెఁగదా?
అన్నా! మానితి వైద్యసేవనిటుపై నాధారమున్ లేద; యా
పన్నుండౌ పసిబాలుఁబ్రోవఁదగదా? భద్రమ్ముగా మాధవా! 5

మ. ఇలువేల్పైన కతాన నీ చరణమెంతేనిన్ బవిత్రంబు ; నీ
చలువన్ జేసియెనాఁడుసౌఖ్యమొదవెన్; సాధింపలేవా? రుజా
బలమున్ దింపుమ నాదుపుత్రుఁ గరుణింపన్ రమ్మ నీనామమే
బలమియ్యంగలదంచు నెంచిసతమున్ బ్రార్థింతునో మాధవా ! 6

శా. రావే! నాసుతుఁబ్రోవవే! విజయముల్ ప్రాప్తింపఁగాఁజేయవే
ఈవే నాకభయప్రధాన మెటులో యెంతెంతయో వేడఁగా
నీవే ? నాఁడల ద్రౌపదీసతికి నెంతేనిన్ ఫలంబల్ల న
న్నీవే రక్షణసేయఁగావలెదయన్ వీక్షించుచున్ మాధవా!7

చ. ప్రకటిత దైవయోగమున బాలుఁడు మిక్కుటమైన బాధచే
వికలత నొందుచుండె నఱవీసమునైన బలంబు లేదు; శా
ఖకుఁడు కృశించుచుండెఁ బరువా! కృపఁజూడఁగ నిచ్చగింపవా?
సుకమును గల్గఁ జేయవ, విశుద్ధమనమ్మునఁ బ్రోచి మాధవా! 8

శా. ఏ పాపమ్మును జేయలేదు సుతు నీవేలా? దయన్ బ్రోవవో
పాపమ్మే కీడఁ జేసినన్ గృపకు దాఁ బాత్రుండు గాఁడొక్కొ మా
పాపమ్ముల్ భరియించెదన్ వదలుమా భారంబు నాపైని నీ
శ్రీపాదాబ్జముఁ గొల్తుఁ బ్రోవుమెటొ నీ రేజాక్ష యో మాధవా!9

మ. చెడురోగమ్ము దయించె బాలునకు నిన్ సేవించుటే ధర్మమం
చెడఁదన్ భక్తిని బాదుఁ గొల్పితిని నిన్నే నమ్మి కొన్నాఁడ, నే
చెడుగుల్ మార్పఁగఁ బోక నా సుతు సుఖాశీర్యుక్తుఁ గావించుచున్
బడయన్ జేయుమయా యురభ్యుదయ సౌభాగ్యంబులో మాధవా

మ. కొడుకీరీతి దురంత వేదనలచేఁ గోడొందిగూ పెట్టఁగా
నెడఁదన్ సౌఖ్యమదెట్లు గల్గు? హితమే యేరీతిఁ బ్రాప్తించు? న
న్నడలన్ జేయక సాయమిచ్చి కృపతో నాలింపుమా మత్సుతున్
దడ బాలుం గలుగంగ నీయకుము మోదంబిమ్మ యో మాధవా! 11

శా. తగ్గున్ రోగబలంబటంచు నిటు పద్యాల్ సెప్పఁగాఁ బూనితే
తగ్గన్ గప్పడదెంత మాత్రమును చున్ దర్శించుమ దుర్బుద్ధి; బల్
సిగ్గున్ జెందితిఁ జేయు కార్యమెదియున్ లేదాయె నీవెట్టులో
నగ్గన్ జేయుమ మత్ప్రియత్నములు నిన్నే నమ్మితిన్ మాధవా!12

శా. "ఆలస్యాదమృతం విషం" బసిగదా యార్యోక్తి యైనచోఁ
బాలున్ రక్షణసేయుటొప్పు నిపుడే వర్ధిష్ణుఁగాఁ జేయుచున్
బాలన్ ముంచిన నీట ముంచిన సరే భారంబు నీదే సుమీ
పాలింపందగు వార లెవ్వరిఁక దేవా! మమ్ము నో మాధవా!

శా. ఎన్నం డీచెడురోగముల్ విడుసుతుండెన్నందుదానాడు, నా
కెన్నండబ్బుసుఖంబు మత్సుతుఁడునింకెన్నండు నారోగ్యసం
పన్నుండై తనరారుఁ జెప్పు మిపుడే ప్రార్థించుచున్నాఁడ నీ
కన్నన్ వేఱొక దిక్కునాకుఁ గలదా? కాపాడవా మాధవా!
శా. ఏనాఁడేది భవత్కృపన్ దొఱకునో హెచ్చైనభాగ్యమ్ముగా
నేనెప్డున్ దలపోయుచుందునదియే; తృప్తిన్ వహింతున్ గదా
దేనిన్ గోరి త్తగవేఁడ మత్సుతునియారోగ్యంబు మోతండ్రి! యా
పైనీచిత్తము నాదు భాగ్యమనుచున్ బ్రార్థించితిన్ మాధవా!
ఉ. మందులు మాని వేసితిని మావలనన్ దగుయత్నమేది? యే
చందమునన్ సుతుండు మనఁజాలు? నిఁకేది యొనర్పలేక ని
న్నుందగ వేఁడుకొంటిమి మనోబలమున్ గృశియించెనింక బా
లుందయఁబ్రోవఁగాఁదగదె? లోపము లెంచఁగఁబోక మాధవా!
శా. ఆరాధించుట లేదె నిన్నదనిరాహారుండనై దీక్షతో
నేరాత్రిం బవిడకుండ ; భాగవత మెంతేనిన్ బఠింతున్ గదా
కారుణ్యామృతమింత జల్లియెటులో గాపాడు మో తండ్రి నీ
వేరాణించెదు త్రోవఁ జూపవలె నిన్నేకొల్తునో మాధవా! 17
మ. పరులన్ బాధలు పెట్టుచుంటినొ? కృపన్ బాటింప కేయుంటినో?
పరుసంబుల్ వచియించి పెద్దలను సంభావింపఁగా లేదొ? నీ
చరణారాధనమూన లేదొ ? సుతుపై సాధింపఁగా జెల్లునే ?
కరిరాజున్ గృపఁగాచినట్లుసుతునిన్ గాపాడు మోమాధవా! 18
శా. ఏవో మందులు వేసినాఁడ నెద నిన్నే దిక్కుగా నమ్మి నా
భావంబందు నధైర్యమెంతయును నిల్పన్ గానశక్తుండనై
భావింపందగ దింక నా దొసఁగులన్ బాలున్ దయన్ జూడుమా
నీవేకాక మఱేదిదిక్కు చెపుమా నిక్కంబుగా మాధవా ! 19

శా. నాచాంచల్యము లెంచఁబోకు మెటులో నాపుత్రునిం గాచి నా
వాచాదోషములున్నచో నవి క్షమింపన్ జేసి శిక్షించి నీ
వే చందమ్మున నైనఁ బ్రోచు నెడ నీ కే పుణ్యమబ్బుం గదా
నీచేఁగానిది లోకమందు గల్గునె? కృపన్ వీక్షింపుమో మాధవా! 20

శా. ఈరోగం బెటు మాను బిడ్డనికి నీవే చెప్పు కారుణ్యమే
పారన్ జూడుమ పుత్రభిక్ష నిడుమా ప్రార్థించుచున్నాఁడ నా
మారాటంబుఁ ద్యజింపఁ జేయుమిఁక నత్యంతమ్ము సద్భక్తితో
నారాధించుచుంటి పుత్రునకు సౌఖ్యం బిమ్మయో మాధవా! 21

శా. నీకారుణ్య మొకింత నా సుతుపయిన్ నిల్పంగ నున్నంత న
స్తోకంబైన సుఖాయురున్నతులచే శోభిల్లు సత్పుత్రుఁడున్
నాకున్ మోదము సంఘటించు నిను విన్నాణంబుగాఁ గొల్చెదన్
నీకన్నన్ బర దైవమేది చెపుమా నిక్కంబుగా మాధవా! 22

శా. బాలుం డేడ? మహారుజార్తిఁ దపియింపన్ గల్గఁగా నేడ? హా
జాలిం బూనుమ పుత్రరత్నము నెటో సాకం బ్రయత్నింపుమా
పాలన్ ముంచిన నీట ముంచినను నీపాదంబె దిక్కంచు ప
ద్యాలన్ నీపయి వ్రాసినాఁడ దయతో నాలింపుమా మాధవా! 23

శా. నా పుత్రోద్భవుఁ డీమహారుజల చే నల్గంగ దౌర్బల్యమై
యాయాసమ్ముఁ జెందుచుండెనకటా! యాలస్యమింకేటికో?
నీయుద్దేశ మెఱుంగ భారమిడితిన్ నీపైని బ్రోవంగ నీ
సాయంబున్నని కేల గల్గు భయముల్ సర్వేశ్వరా మాధవా! 24

మ. ఇతరోపాయ మొకింత గన్పడదు నిన్నే నమ్మితిన్ దండ్రి! మ
త్సుతు నారోగ్యను డెట్లు గల్గునను చున్ దూపిల్లుచున్నాఁడఁ బై
నితరకర్తవ్యము నీపదాబ్జభజనం బేయుంచు నీరీతి సం
స్తుతి సేయున్ దొరకొంటి బ్రోవు మెటులో జోహారులో మాధవా! 25

మ. అతిథుల్ వచ్చినగౌరవోన్నతులచే నత్యాదరంబీయనో?
యతిపూజ్యుండవటంచు నిన్ను నెదలో నత్యంతముం గొల్వనో?
యతిభోగమ్మున గర్వమింతగలదో? యుర్వింబెతప్పున్న నా
సుతునిన్ బాలుని వేచనేల? దయతో శోధింపుమా మాధవా!26

శా. బాలుం జూచినవారలెల్ల కరుణం బాష్పంబులం విడ్చుచుం
జాలిం జెందుచునున్న వారలు రమానాథుండె దిక్కంచు నీ
వేలీలం బ్రిసరింపఁ జేతువో కృపం వీక్షించి రక్షింప నిం
కేలా? జాగొనరింతువిట్లు బరువా? యీ మాత్రమో మాధవా!27

శా. బాలుం శుష్కశరీరుఁ గన్న సుతునిం బాయంగ లేకక్కటా!
నేలం గూలుచు బాష్పపూరములచే నేలంటకన్దమ్ములం
వ్రాలన్ జేసి తపించుగుండెపగులం మద్భార్యదుఃఖంబుచే
వ్రేలాడంగ నిఁకెప్డుగల్గుఁ గరుణావిర్భావమో మాధవా!28

శా. ఆర్తిం జెందిన కారణమ్మునఁ గదా యాచింతు నీరీతి రో
గార్తిం బాపుము మత్కుమారునకు సంప్రార్థింతు నాకోర్కెలం
బూర్తిం జేసి సుఖింపఁ జేతువనుచుం లోనెంతు నారోగ్యవి
స్ఫూర్తిం గల్గగ జేయుమా సుతునికిం మోదమ్మగున్ మాధవా!29

శా. భక్తిం బ్రార్థన సేయుచుంటి నిటులం బద్యంబులే దిక్కు నా
వ్యక్తిం మార్పఁగ లేను నీవెఱుఁగవో ప్రార్థింపఁగా నిట్టులా
సక్తిం మున్నొకసారి నీవొసఁగవో సౌఖ్యమ్ములం రోగని
ర్ముక్తిన్ జేయుము మత్కుమారునకు నామోదమ్ముగం మాధవా!30

శా. నీపైనం గల భక్తిభావములచే నిర్మించితిం బద్యముల్
నాపై నీవటులే దయం జూనుపఁగా న్యాయంబు నాపైని నీ
ప్రాపున్నం గద యెట్టి యత్నములు సేయంగా ఫలంబబ్బు నీ
ప్రాపుం గాంచనివారికెట్లు జయమబ్బుం గల్గునో మాధవా!31

ఉ. వీసముగాని లేక యొఱవీసమునైనను దాచకుండ నే
జేసిన పాపముల్ దెలియఁజెప్పితిదప్పక నొక్కటైననున్
దోసములెంచఁబోక మము దూరముసేయక నీకృపారతిన్
భాసిలఁజేసి పుత్రునకు భద్రమొసంగుమ వేగమాధవా! 32

మ. వ్రతముల్ సత్తపముల్ జపంబులును సద్భక్తిన్ బిసాళించి స
మ్మతిఁజేయంగలశక్తిలేక యిటులే పద్యాళితోఁ గొల్చు ప
ద్ధతినభ్యాసముచేసినాఁడఁ దొలుదొల్తన్ మత్సుతున్ బ్రోవుమీ
గతిదైవార్చనకున్ బ్రయోజనమగున్ గాదొక్కొ యోమాధవా 33

సీ. రక్షింపు రక్షింపు రక్షింపు మనువారి
నెప్డైన దయను రక్షించితేని
శరణు జొచ్చినవాని సాకుట రాజ ధ
ర్మమనుచు లోనెంచు ప్రభుఁడవేని
దీనావనుఁడను సత్కీర్తిఁ గాంచిన యట్టి
సత్కార్యమెప్డైన సలిపితేని
నీకాళ్లపైఁబడి నీవదిక్కని గొల్చు
పగవానినైన చేబట్టితేని

గీ. నిన్ను నమ్మి భజించిన నన్ను నేలఁ
గావకుందువు? కృపఁదాల్చి దేవదేవ!
నీకటాక్షము నాపైన నిలుపరాదె?
పాపమున్నను క్షమియింపఁ బాడిగాదె? 34

శా. నీకారుణ్యముకల్మి నాసుతునకున్ నీరోగమున్ జేయుచో
పైకిన్ గుఱ్ఱఁదురాఁగలండటయినన్ బ్రాణమ్ములన్ నీదయా
ప్రాకట్యమ్మునఁ గాంచెనంచు నెదసంభావింతు నిన్నెప్పుడున్
నాకున్ సౌఖ్యముగల్గు నీవలననే నాతండ్రి యోమాధవా! 35

శా. దీక్షన్‌బట్టి జపించుచుంటి ననురక్తిన్‌బూని మత్పుత్రునిన్
రక్షింపంగల శక్తిలేదె? మఱువన్‌న్యాయంబె? తప్పున్నచో
శిక్షింపన్‌ దగు నీకు నర్భకునిపైఁ జెల్లింపఁగాఁ జెల్లునే?
సాక్షాత్కల్పకమీవు ప్రోవుమెటులో జాగేలరో మాధవా! 36

ఉ. నీదయచేతఁ గుఱ్ఱనికి నెమ్మదిగల్గునటంచు నెమ్మదిన్
మోదముఁ జెందుచుంటిమును నోచినపుణ్యము దెట్టులుండినన్
గాదనఁబోక నీదుపదకంజముఁబట్టితిఁ గాన నూరకే
పోదు భవత్కృపారసముపూర్తిగ జిల్కెడువేళ మాధవా! 37

ఉ. శ్రేయముగల్గఁదప్పదని చిత్తము ప్రేరణసేయఁ బద్యముల్
వ్రాయుచు నీపదాబ్జముల వ్రాలితి దీనుఁడనంచు వేఁడితిన్
బాయని ప్రేమతత్పరత బాలునిఁబ్రోచితి విప్రునింక దీ
ర్ఘాయువొసంగి జీవితమునందు సుఖంబొనగూర్పు మాధవా! 38

శ్రీ. శ్రీ. శ్రీ. శ్రీ. శ్రీ.

శ్రీ.

మ. అపరాధంబు క్షమింపుమమ్మ జననీ! యానందసంధాయినీ
కపటంబెంతయు లేక నీచరణముల్‌ కంజాక్షి! నేఁబట్టితిన్
జపమున్‌ జేయుచునుంటి నిన్ను సతమున్‌ సద్భక్తితోఁ గొల్చుచున్
కృపఁబ్రోవంగదె మత్కుమారు నెదఁదల్లీ! రాజరాజేశ్వరీ!

వాజిపేయయాజుల మహాలక్ష్మి.

ఆశీర్వచనములు.

శా. శ్రీమూర్తిత్రయమూలమూర్తియగుచున్ క్షేమంకరుండై ఘ
నుం, డై మేలందెడు భాస్కరుండు కరుణాస్వాంతంబువర్వన్ జగ
త్స్వామిత్వంబున వాజపేయకుల సుబ్రహ్మణ్యనామార్భకున్
బ్రేమంబ్రోచుత మామయంబుడుఁగఁగా బేర్మిం బ్రతిష్ఠించుచున్.

బ్రహ్మశ్రీ, కవిసార్వభౌమ, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు.

శా. శ్రీకల్యాణ పరంపరాది సకల శ్రేయంబులంగూర్చి యా
స్తోకం బాయువొసంగి గండమునొగిన్ దూరమ్ముగానెట్టి భ
వ్యాకారున్ బొనరించి ప్రోచు శివు శుద్ధాంతంబు కామేశ్వరీ
రాకాబ్జాస్య కృపారసార్ద్రి మనసుబ్రహ్మణ్యన బ్రమ్ముగన్.

బ్రహ్మశ్రీ, చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు,
శతావధాని.

సీ. కల్వంబులనుపోసి కరము నూరని మందు
శ్రీహరి చరణాబ్జ సేవనంబు
శ్రద్ధనుబూని కాచని మేల్ కషాయంబు
శ్రీహరి చరణాబ్జ సేవనంబు
వేమారు పుటములుబెట్టని భస్మంబు
శ్రీహరి చరణాబ్జ సేవనంబు

భాండంబులనుబెట్ట వండని లేహ్యంబు
శ్రీహరి చరణాబ్జ సేవనంబు

గీ. పావనౌషధ మచ్యుత సేవనంబు
నట్టి మందును సేవింపుమయ్య నీవు
బ్రితుకఁ గలఁడు సుబ్రహ్మణ్య బాలకుండు
హరికటాక్ష వీక్షణముల నందుకొనుచు. 1

గీ. రోగి సేవించు నేని నారోగ్యమిచ్చు
నతని కితరౌషధంబు లద్భుతముగాఁగ
తల్లిదండ్రులు సేవింపఁ దనయుల కిడు
హాయి శ్రీహరిపద సేవ నౌషధంబు. 2

ఆ. గీ. అడవి చెట్లనెల్ల నరసికాచెడువాఁడు
పుట్టలోని చీమఁ బోషించువాఁడు
ఱాతిలోని కప్ప బ్రితుకఁ జేసెడివాఁడు
నీ కుమారుఁ గావలేక పోఁడు. 3

క. సేవింపుము నారాయణు
జీవించును నీ సుతుండు చిరకాలంబుఁ
దీవించితి నీరీతిని
నీవంతలు బాయునింక నిర్మల హృదయా. 4

డాక్టరు, బ్రహ్మశ్రీ, చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు,
ఆంధ్రసాహిత్య చక్రవర్తి.

చ. సుజనవరేణ్య! రామపదశోభిమనోంబుజ! వాజపేయయా
జి జననసంభవా! గుణవశీకృతకోవిద! రామసుబ్బరా
యా! జగదభీష్ట! నీకుశుభమయ్యెడి నీదుకుటుంబమంతయు౯
స్వజనముగందలంచిరఘువర్యుఁడనామయమిచ్చిప్రోచెడిన్. 1

ఆ. నిన్నఁగాక మొన్ననీవు శ్రీజానకీ
పతివి భక్తితోడఁ బద్యశతక
మునసుతించియుంటి మూర్ఖుండె యాతండు
యుష్మదిష్ట మీయకుండుటకును? 2

చ. అరసికుఁగూర్చి చెప్పఁబడునట్టి కవిత్వము వ్యర్థమౌను గా
ని, రసికశేఖరుండు ధరణీపతి రాఘవుఁడట్టివాఁడు నీ
తరుణిని నిన్ను నీసుతులఁ దాఁజిరకాలము మన్పలేఁడె? న
ల్వురినె భరింపలేనపుడు భూభరమింక నెటుల్వహించెడిన్? 3

ఆ. ఏల నీకుఁ బిచ్చి? యీల్గిన ద్విజబాలు
రక్ష చేసినట్టి రాముఁడేమి?
భక్తుఁడైన నీదుపట్టి సుబ్రహ్మణ్యుఁ
డొందు బాధయుడుపకుండునేమి? 4

ఉ. నీదు హృదబ్జమందెకద నిచ్చలు రాఘవుఁడుండుచుంట! త
ద్భాదయతాగ్రమందెయల పుత్రకునింబడవైచి యద్గుమీ
బాధమతెంతకాలమని వైళమనామయమేల యీఁడో యా
మీఁదటఁజూచికొందము సుమిత్రమ! యేటికిఁజింతనీకిఁకన్? 5

బ్రహ్మశ్రీ, జానపాటి పట్టాభిరామశాస్త్రిగారు,
ఎడిటరు, అభినవసరస్వతి.

గీ. మిత్రమా ! నీదు రెండవ పుత్రుఁ డెలమి
నాయురారోగ్యవంతుఁడై యలరునయ్య
ధైర్యమీడక దైవముఁ దలఁపుమయ్య
చిన్నిసుబ్బన్న భువి చిరంజీవియయ్య. 1

మ. వరమేశుండు దయార్ద్రభావమున సౌభాగ్యంబు చేకూర్చి న
ల్లరయన్ వచ్చి యనేక భంగులను భక్తాళిన్ బరీక్షించు నీ
సరణిన్ నేర్చి ముదోద్ధతిన్ భవము పుచ్చన్ గల్గువాఁడే సుధీ
వరుఁడీయంశము నీ వెఱుఁగనిదె సుబ్బారాయధీమన్మణీ! 2

శా. ధైర్యమ్మున్ ద్యజియింపఁబోకు మివిపద్భారమ్ము ధీరాళిధీ
చర్యన్ నిగ్గునఁ దేల్చు కష్టసహనాచారమ్ము గల్గించుఁబెన్
మర్యాదన్ ఘటియించు నిష్టతమసామగ్రిన్ ద్యజింపన్ మహా
ధైర్యమ్మిచ్చుఁ దదార్జనమ్మె భవసార్థక్యమ్ము మిత్రాగ్రణీ! 3

మ. ధరణీదేవత కేలుమోడ్చి గవితోద్యత్సంఘసంధాత దు
ర్భరచింతాతురుఁడయ్యె సత్త్వపులన్ భావంబులున్ మ్రగ్గె స
త్తరుణారీతి నొసంగినట్టి సుతుఁ గుందంజేయఁగానేల ? యీ
శ్వర! లోకంబులు సంతసిల్లునిఁక సుబ్రహ్మణ్యుఁగాపాడుమా

బ్రహ్మశ్రీ, జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రిగారు,

సహస్రావధా॥

సుతస్మృతి.

చ. ఎవరిటు పాపకర్మమున నేడ్వఁగఁ జూచుచు నవ్వినారమో?
యెవరిటు దుఃఖజాలమున నీఁదఁగఁ జూచి సహించినారమో?
యెవరినిఁ దూలనాడితిమో? యీర్ష్యవహించి మఱెట్టి దుష్కృతుల్
భువినొనరించినారమొ? విముక్తములౌనె మహాపరాధముల్. 1

మ. కలమున్ బట్టి రచించు నీవు కరమా! కాష్టంబులోఁ బెట్టి నా
వలపుత్రున్ బసిబాలు నెట్టులకటా! యావేశమున్ గొల్పుచ
ర్యలఁ జేయంగ సహించినావొ? కృపశూన్యంబయ్యెనో లేక యి
ట్టులెనా జీవితమున్ ముగింపవలెనో? దుల్లున్ గదా వ్యర్థమై. 2
కొడుకా! నీకయి బెంగపెట్టుకొనుచున్ గోడొంది గూపెట్టుచున్
విడిపోయెన్ గద నీ ఋణంబనుచు నిన్ వేమారు ధ్యానించుచున్
బడిపోయెన్ గద పుత్రరత్నమనుచున్ భావించి భారంబుతో
నెడఁదన్ గుందును నీదు తల్లియకటా! యేగంగ నెట్లో పితో. 3

మ. కొడుకా! యిందునునందునన్ గలుగు నాకున్ మేలు నీవల్ల నం
చెడఁదన్ గాంచిన సంతసంబు తుదకెంతే నిన్ వృథాయయ్యె నేఁ
బడు కష్టంబు ఫలింపదయ్యె ఘనమా ప్రారబ్ధకర్మంబు చేఁ
బుడమిన్ నోఁచిన నోము కొంచెము గదా మోక్షంబెటుల్ గల్గెడిన్.

శా. ఎన్నో కష్టములొంది పెంచితిమి రెండేండ్లీ ధరన్ నిన్ను నో
యన్నా! నీ ఋణమప్డె దీఱెననుచున్ స్వాంతమ్మునం దెంచితే?
విన్నాణంబగు నాటపాటలనుచున్ వేమాఱు వీక్షించుచున్
కన్నుల్ ముష్టములయ్యెఁగాని యెడలన్ గన్పింపవా పుత్రకా. 5

ఉ. నాకొఱకై తపించితి మనమ్మునఁ గన్నుల విప్పిచూచుచున్
బ్రాఁకుచువచ్చి కంఠమును బట్టితి గట్టిగ కౌఁగలించుచున్
నాకిడు ముద్దులన్నియును నాయన! వ్యర్థములయ్యె నింతలో!
నీకయి బెంగఁగాంచిధరణిన్ గృశియించెదనిట్లు పుత్రికా! 6

ఉ. నీకొఱకై జపంబులను నిచ్చలు సల్పితి దీక్షఁబట్టి యా
స్తోకబలాయురున్నతులతోఁదులఁదూఁగుదువంచుఁబండితుల్
నీకిడినారు దీవనలు నేనటుకోరఁగ మృత్యువింతలో
నీకయి వేచియుండుటను నిష్ఫలమయ్యెఁ బ్రయత్నమంతయున్. 7

మ. రతనాలాల్లైడు ముద్దుపట్టి వనుచున్ బ్రాణంబు లర్పించి నీ
ప్రీతిమన్ జూచి వినోదలీలలఁ గడున్ రాజిల్లె నీ తల్లి హా!
వెతలన్ ముంచి దివంబునేగితివె? నిన్ వీక్షింపఁగా లేని దే
బ్రతుకంచున్ దపియించుచుందుమిఁక యావజ్జీవమున్ బుత్రికా! 8

మ. నవమాసంబులు మోసి కన్న జననిన్ న్యాయంబె వీడంగ ని
బ్భువి జన్మించిన దాది రోగములచేఁ బొక్కంగ వేసారి పొం
దవు సౌఖ్యంబని గోసివీడితివె? పుత్రా! మమ్ములన్ బాసి నీ
వవలన్ మోక్షపథంబుఁ జేరుటకునై యత్నంబులన్ సల్పుచున్. 9

మ. అరిగెన్ జబ్బనికొంతకాల మెటులో యానందమున్ జెందఁగాఁ
దిరిగెన్ రోగబలంబు చుట్టుకొనియెన్ దీవ్రంబుగా నాఁడు నీ
దురవస్థన్ గనలేక యేడ్చితిమి పుత్రుండేడ? రోగార్తిచే
భరమై యిట్లు గృశించుటేడ? యనుచున్ బ్రాణాశలన్ వీడుచున్. 10

శా. నీయల్పాయువు నాయభాగ్యదశయున్ రెండేకమైయుండఁగా
నాయన్నా! ఫలమేమి చేకుఱును? యత్నంబెంతగాఁ జేసినన్
వేయున్ గాఁబనియేమి? యౌషధములన్ శ్రీలక్ష్మణాచార్యులున్
శ్రేయంబెట్లు లభించునాకు నిఁకఁ దండ్రీ! ప్రాప్తిలేకుండినన్. 11

మ. పరమప్రీతిని౯ బెంచినారము కదా భావింప నీమాతయున్
గరమున్ జిచ్చురగిల్చిపోయితివిలోఁ గారుణ్యమున్ వీడుచున్
ధరపై వర్ధిలు వీఁడటంచు వినుతన్ గర్వించినానింతలో
మరణంబొందుటదుఃఖహేతువనుచున్ మాతండ్రియూహింపవా!

శా. తల్లిన్ బోలినవాఁడవౌట ధరణిన్ ధన్యుండు వీఁడంచు సం
పల్లీలావిభవంబు లందుకొనుచున్ వర్ధిల్లు పుణ్యాంబు నీ
కెల్లప్డున్ లభియించునంచు బుధులెంతేనిన్ బ్రసంగింపరే?
కల్లా! వాక్యము నీదుపట్లతనయా! కాలంబెటుల్ మారెనో. 13

శా. చాలన్ బాల్యమునందె సొంపులొలుకన్ సాగించి నీవట్లు ధా
రాళప్రక్రియ నీదులీలల గతిన్ రాణింపఁగాఁ జేయుచున్
వాలాయంబుగ హాయిఁగూర్చితివి సంభావ్యంబు నీచర్యలీయిం
కేలా? శోకముత్పత్తిఁగాంతువికఁదండ్రీ! నామహానందమా! 14

ఉ. పుట్టినదాది నాకుఁ బరిపూర్ణధనంబు లభియించుభాగ్యముల్
పట్టె విశేషగౌరవము వర్ధిలుచుండెను నాఁడునాఁటికిన్
బట్టినదెల్లఁ గాంచనము నా విలసిల్లె నిఁకేమి లోటు? నా
కెట్టియెడన్ శ్రమన్ గలుగదించుకయైననుగాని పుత్రకా! 15

ఉ. పుత్రుఁడు వంశరత్నమని పొంగుచు నుంటిని నేఁటిదాఁక నే
మాత్రపుబెంగయేనియును మార్కొనదయ్యెను నెమ్మనమ్మునన్
బుత్రులొకిద్దఱంచు మది మోదముఁగల్గెడు నింతలోపలన్
జిత్రముగాహరించితె? కనిష్ఠుని మమ్మిటుబాయ మాధవా! 16

చ. అరుదుగ నీవు వెంటఁబడి యన్ననుఁగూడి వినోదలీలలన్
జరుపుచు నాడుకొంచును బ్రసంగములెన్నియొ చెప్పికొంచు
నుం, దరవరనారవిందము ముదంబునఁ జూపెడు నీవుపుత్రకా!
గురుతరమోక్షధామమునకున్ సుఖమొందఁగనిప్పుడేగితే? 17

గీ. నీదు చిత్రపటమునైన నిల్పలేదు
నిండు వేడుకఁ జూచి వర్ణించు కొఱకు
నీ విలాసగతుల కేవి నీదు చూపు
మఱపురాదింక నెన్ని జన్మములకైన. 18

ఉ. ఇచ్చట మాదుగర్భమున నేల జనింపఁగ నిచ్చగించితో?
యెచ్చటినుండి వచ్చితివొ? యిచ్చటికెట్టులవచ్చినాఁడవో?
యెచ్చటికేఁగుదెంచితివొ? యెవ్వరెఱుంగుదు రావిచారముల్
హెచ్చగఁ దాపమేలయిడి యేగితి; చిత్రములయ్య నీగతుల్ .19

శా. ఈదుఃఖంబునకంతముండదుగదా యెంతెంతఁగా నేడ్చినన్
వేదాంతార్థములెల్లఁ జెప్పినను కీన్ విన్న గీతాదులన్
వేదంబుల్ పఠియించినన్ ఋషులతో వేమాఱుమాట్లాడినన్
మోదంబించుకయైనఁ గల్గదుగదా! మూఢాత్ములా వారికిన్ .20

సీ. నీనామ భజనంబు నిఖిల పాప మడంచు
నను మాట సత్యంబు నయ్యెనేని
ఆర్తరక్షకుఁడ వీవంచు మునీశ్వరు
లాడు మాటలు నిజమయ్యెనేని
నీ హృదబ్జము నవనీతమై కరుణార
సాన్వితమయి తగి యలరునేని
భక్తకోటిని బ్రోచు భావంబు నీలోన
నించుకైనను గల్గి యుంచునేని

గీ. నిన్ను నమ్మి చేసిన పూజ నిష్ఫల మగు
టేమి? నిన్గొల్చుతటి లోపమేదియైన
కలిగెనేమొ? నాకింకేది కలదు దిక్కు?
తెలియఁ జెప్పుమా నాకింత దీనరక్ష! 21

శా. నేనీ గ్రంథము నీదుపేరున భువిన్ నిర్మింపఁగా జేసితిన్
నీనామస్మరణంబుఁ జేసెద నిటుల్ నీపైఁ గృతుల్ వ్రాసి నా
యానందంబును దీర్చుకొందు నటుపై నత్యంతమున్ గల్గుకు
న్నే? నీయాత్మకు శాంతిచింతిలకుతండ్రీ! మమ్మిటుల్ పాయుటన్ . 22

ఓం శ్శాం శ్శాంతి శ్శాంతిః.

ప్ర బో ధ ము.

వేదాంతరహస్యసారసంగ్రహ తత్వధర్మనీతి ప్రబోధనాం తర్యమును గ్రహించియు ప్రారబ్ధకర్మమనంబడు నీ యశాశ్వత శారీరకర్మ ననుసరించి యొకింత చింతింప శోచనీయము.

" సంసారసాగరం దుఃఖం తస్మాజ్జాగ్రితజాగ్రిత "యను నార్యోక్తినిఁ బఠించియు మహాంధకారబంధురనిబిడంబై దారి తెన్నుంగానక యీమానవశరీరము వసుంధర నెన్నియో మాయలీలలఁ దాల్చుచున్నది. సాంసారిక వ్యావహారిక బాధలెన్ని యో బాపవచ్చును. కాని నైసర్గిక బాధలఁబాపనేరితరము ? లాట లిఖితమున కేమార్పును లేదు. " దాటఁగవచ్చునే విధివిధానము నేరికినైన నిభ్బళిన్ " ఆహా! మానవావస్థ జననమరణాదులం దెన్నియోమార్పులను జెందుచున్నది. ఆత్మజ్ఞానికి సర్వము సమానము. " జాతస్యహిధ్రువో మృత్యుర్ ధ్రువం జన్మమృతస్యచ " అను గీతావాక్య ప్రమాణ మనుసరించి యుత్పత్తి వినాశములకు శోకింపంబనిలేదు.

"సుఖదుఃఖే సమేకృత్వా లాభాలాభౌ జయాజయౌ" అను నార్యోక్తి స్మరింపం దగు.

అవివేకాంధాకారమునఁ జరించు మూఢులకే యున్ని యుపద్రవములు. వారే చీటికిమాటికిఁ జచ్చుచుఁబుట్టుచుందురు. ఆత్మబోధజ్ఞానాలంకారునకు మరణమొక్కటియె.

అరిషడ్వర్గములఁ జిక్కుకొనువారి కేగతియును లేదు.

"ధ్యాయతో విషయాన్ పుంసః సఙ్గస్తేషూపజాయతే
సఙ్గాత్సంజాయతే కామః కామాత్క్రోధోఽభిజాయతే
క్రోధాద్భవతి సమ్మోహః సమ్మోహాత్ స్మృతివిభ్రమః
స్మృతిభ్రంశాద్ బుద్ధినాశో బుద్ధినాశాత్ప్రణశ్యతి."

అందుచే బుద్ధ్యాదప్రాయములగు నీ తుచ్ఛశరీర సౌఖ్యములను మోహాలీలలఁ దగులుకొనక, రాగద్వేషములను వదలి స్థిరమై ప్రకాశించు బ్రహ్మజ్ఞానమును భక్తిమార్గమునఁ గను గొని ముక్తిమార్గ మెఱుంగుటయే మానవజాతికిఁ బ్రధానము

" జగతిఁ బుట్టిపుట్టి చచ్చిచచ్చి
పొరలనేల మనకుఁ బుట్టని చావని
త్రోవ వెదకికొనుట దొడ్డ బుద్ధి "

అట్టి జన్మమే ధన్యము :—

" ధూమేనావ్రియతే వహ్ని ర్యథాఽఽదర్శో మలేన చ
యథోల్బేనావృతో గర్భ స్తథా తే నేదమావృతమ్. "

శాస్త్రజన్యజ్ఞానము కలిగినను కామావృతమైనచో నది పరమాత్మ సాక్షాత్కారమునకై ప్రకాశింపదు. పరమేశ్వరుని లీలావినోదంబులు కడుచిత్రములు. నిశ్చల భక్తిమార్గమునం గాక భగవంతుఁడు తదితర మార్గములచేఁ జిక్కుట కడుదుర్లభము. తన భక్తులకే సదా కష్టము లనేకములు గల్పించుచుండును. ఇట్టి శిక్షాసూత్రమున నిల్చి, ధైర్యము వహించి కష్టముల కోర్చినవాఁడే భగవత్ప్రియుఁ డగును. అరుగ రాచిన కొలఁది పరిమళమతిశయించు శ్రీచందనపుఁ జెక్కవలె కష్టములు హెచ్చినకొలఁది జ్ఞానోదయము కలుగుట కవకాశముండును. అప్పుడే జీవితతరణోపాయములను గాంచి భగవత్సాన్నిధ్యమున కరుగుటకు వీలగును. సాధారణముగా మానవులకు పరమేశ్వర నామస్మరణజ్ఞానమే కష్టకాలమందు స్ఫురించును. అట్టి దనేక మూఢగతులం బోలియుండు. సుఖభోగముల భోగించు కాలమున భగవానుని మాటయె మఱచిపోవుట సహజము. సకల జన్మంబులందును మానుష జన్మంబు శ్రేష్ఠంబు. జీవితకాలము నిమితంబై యుండు. వృధాప్రయాసంబున నాయుర్వ్యయంబు సేయం జనదు. హరిభజనంబున రాత్మంబు సిద్ధించు.

దేహావసానపర్యంతంబు నారాయణ చరణారవింద సేవనంబు కర్తవ్యంబు. సంసారగతుల నమ్మి చెడిపోవుట ధర్మంబు కాదు. పరమేశ్వరధ్యానము సేయుట కనేకమార్గంబులు కలవు. కవులు శబ్దధ్యానపరాయణులై ధన్యులగుచున్నవారు. కొందఱు జీవితకాలమంతయు భాగవతాది సద్గ్రంథములను బఠించి, భగవల్లీలలస్మరించి కృతకృత్యు లగుచున్నారు. మఱికొందఱు

యోగాభ్యాసముఁ జేసి చరితార్థులగుచున్నారు. విద్యుల్లతల వలె మాయమగు నీ జీవితము శాశ్వతమని తలంపరాదు. నీటి బుగ్గలవలె యశాశ్వతంబగు భోగభాగ్యంబుల నాశింపరాదు. అస్థిరములై చలించెడు ధనకనకవస్తువాహనములపై నాశయుంచరాదు. గృహారామక్షేత్రములకై పీకులాడరాదు. కలిగిన దాన తృప్తిఁబడి దయాసత్య ధర్మశౌచ మార్గంబుల నిలుచుక సమస్త జీవరాసుల కాధారభూతుండగు పరమాత్ముని సేవఁ జేయుటయె ముఖ్యసాధనము.

గీ. "చేతులారంగ శివుని పూజింపఁడేని
నోరు నొవ్వంగ హరికీర్తి నుడువఁడేని
దయయు సత్యంబు లోనుగాఁ దలఁపఁడేని
కలుగనేటికి తల్లుల కడుపుచేటు."

అను భాగవతధర్మం బనుష్ఠింపవలయు. గడచిన కాలము తిరిగి రాఁజాలదు. క్షణమైనను వృథఁబుచ్చఁగ జనదు. ఇంతమాత్రము జ్ఞానమలవడఁ జేసిన యతీశ్వరులగు నాపినతండ్రి బ్రహ్మశ్రీ సోమనాథ శాస్త్రులవారి కే నెంతయుఁ గృతజ్ఞుఁడను. ఆ అస్మద్గురువర్యుల కృపాకటాక్షమున మఱికొంత భక్తిజ్ఞానము వడఁ జేసుకొను కవితాధనమొకింత నాకు లభించె. అంతకు పైన సంసారకూపంబున నిక్కట్టులు నెక్కుడుగఁ జిక్కుకొన్న సమయంబునఁ బరమేశ్వర ధ్యానమే శరణ్యమనియు నారోగ్య మార్గమునకై భగవానుని స్తుతించుటచే నట్టి చిక్కులను బాపు ననియు నస్మద్గురు ముఖ్యులగు బ్రహ్మశ్రీ చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి గారు బోధించుచు నారోగ్యమార్గప్రదర్శకులైరి. వారి కుమా

రున కారోగ్యము తప్పినప్పుడు " ఆరోగ్యకామేశ్వరి " అను స్తోత్రము వ్రాసి తుదకు, కుమారుని ఆరోగ్యవంతునిఁ జేసుకొనిరి. మనపూర్వులును,

" పూర్వ జన్మకృతం పాపం వ్యాధి రూపేణ బాధతే
తచ్ఛాంతి రౌషధైర్దానైర్జప హోమ సురార్చనైః "

యని సురార్చనము కడపటి సాధనముగ వ్రాసియుండ మా పరమగురువులును దానికే ప్రాధాన్య మిచ్చిరి. అస్మద్గురు వర్యులవలె నేను నిరాఘాటపాండిత్యంబును నిరర్గళవాక్శుద్ధియును గల్గినవాఁడను గాకపోయినను గురుమార్గమవలంభించుట శ్రేయమని తలంచితి. నాగురువులును నన్నట్లె ప్రోత్సహించుచున్నవారు. ఇంతకుముందు సతీసుతులతో నేనారోగ్యముఁ దప్పి దీర్ఘరోగార్తిచేఁ దపియించు సమయమున " ఆరోగ్య వేంకటేశ్వర రాజరాజేశ్వరీ శతకములు " ను " శనిస్తోత్ర నక్షత్రమాల "యను చిన్ని గ్రంథంబును రచియించి గురువర్యుల యాశీర్వాదంబులం బడసి, భగవదనుగ్రహామువలన మేముందరమును సుఖముగ నున్నవారము. ఇప్పుడు సుబ్రహ్మణ్యమను గారెండవ కుమారుఁడు రోగబాధలచేఁ జిక్కుచుండ, "ఆరోగ్యమాధవ" మను గ్రంథంబును వ్రాసితి. నైసర్గికమహాత్త్వ తత్త్వరహస్య స్వరూపముల నెఱింగిన కవిమందారులు భాషాగురువులు కనుక కవియనువానియందునుఁ గవివాక్కునందును నాకెక్కుడభిమానము. విశేషించి పెద్దల యాశీర్వాదమునందు నాకభిమానము మెండు! కావున నాసుతుఁ డాపద్దశలో నున్నవాఁడనియు, పద్యరూపమున దీవింపుఁడనియు నేను బ్రార్థింప

నాగురువులును కొందఱు మిత్రులును నాశీర్వాద పత్రములను బంపిరి. నాసుతుఁడు క్రమముగఁ గొన్నిదినములవఱకు నారోగ్యదశలోనికి వచ్చుచున్నాఁడని నాకు నమ్మకము కలిగినది.

నేనును దానములనియు, జపములనియు, వ్రతములనియు నిత్యాదిపుణ్యకార్యముల శక్తిఁగొలఁది చేయుచునే యుంటిని. ఇట్లు రెండుమాసములు గడచినవి. దైవతారాధనమందు నాకుఁ గల నమ్మకముచే రమారమి 15 దినములవఱకు నౌషధమిచ్చుట మానితిని. గురువర్యుల యాశీర్వాద పత్రములు ఫలించినవని గర్వించుచుంటిని. నామిత్రులందఱును నాశ్చర్యపడి నన్నుఁ బ్రశంసించుచుండిరి. దైవము నాయందుండి కుఱ్ఱవానిని రక్షించెనని పలువురు చూచినవారలెల్ల నబ్బురపడిరి. మంచమున నంటిపెట్టుకొని యున్నవాఁడు తిరిగి లేచి యథాప్రకారముగ నన్నము కూడఁ దినుచు, తనకుఁదానె కూర్చుండుటకు మొదలుపెట్టెను. ఇట్టి మార్గములోనికి వచ్చుసమయమున నాపురాకృతపాపకర్మమునో తన కల్పాయు వగుటచేతనో రోగము తిరుగఁబెట్ట నార్పఁదీర్పఁగాని శోకాగ్నిలో మమ్ముల నుంచి నాసుతుండు దివంబున కరిగె. ఇట్టి శిక్షాసుత్రమున కిదియు ప్రప్రథమప్రహారమైనను పైతత్త్వజ్ఞానమనుసరించి యెట్టులో ధైర్యముఁ జిక్కఁబట్టుకొని మానుషత్వమునఁ గొంచెము చలించినను మౌర్ఖ్యముగ శోకించుటలేదు.

“ పోదు దేహాభిమానంబు మునులకైన ”

అనునట్లు సంసారసాగరమున నున్న నాకు విజ్ఞాన మెక్కడనుండి వచ్చును ?

సర్వయత్నములు నిష్ఫలములైనవని నేను నిశ్చయముగ వగచుట లేదు. అనుభవమునఁగాని విషయపరిజ్ఞానమేదియును చక్కఁగ నేర్పడదు. గ్రంథరాజములఁ బరిశోధించినంతమాత్రమునఁ జక్కని జ్ఞానమలవడిన దనుట కవకాశము లేదు. శిక్షచేతనుగాని విద్య చక్కఁబడదు. పదును వెట్టినఁగాని కత్తి శోభిల్లదు. దివ్యజ్ఞానమేర్పడుటకు మానవులకు సర్వవిషయములును అనుభవములై యుండవలయునని నానమ్మిక. భగవల్లీలలు కడు చిత్రము లని చెప్పియుంటిని. పరమేశ్వరుఁడు దయామయుఁడు గదా. ఆత్మజ్ఞానమెఱింగిన విజ్ఞానధనులు దీనికై శోకింపరు. ఈ కష్టసుఖములు భౌతిక శరీరసంబంధములైనవి కాని ఆత్మ నెంతమాత్రమును స్పృశింపవు. ఆత్మ నిత్యమైనది. దాని కెచలనమును లేదు.

" నైనంఛిందంతిశస్త్రాణి। నైనందహతిపావకః
నచైనంక్లేదయన్త్యాపో। నశోషయతిమారుతః।
వాసాంసిజీర్ణానియథావిహాయ। నవానిగృహ్ణాతినరోఽపరాణి
తథాశరీరాణివిహాయజీర్ణా। న్యన్యానిసంయాతినవానిదేహీ"

అను గీతావచనంబులే దీనికిఁ బ్రమాణము :—

" చచ్చినవాని కేడ్చెదరు చావునకొల్లక డాఁగవచ్చునే?
యెచ్చటఁబుట్టె నచ్చటికి నేఁగుట నైజము ప్రాణికోటికిన్."

భగవంతుని యుద్దేశము గొప్పది. మూఢమానవులకిది యెఱుంగరానిది. "సర్వము మంచికొఱకే" యను నార్యోక్తియందు నాకిప్పటికిని దృఢవిశ్వాసము కలదు నా "ఆరోగ్యమాధవము" గాని తత్సంబంధించిన యాశీర్వాద పద్యములుగాని

మతెవ్వియును వ్యర్థములు గావనియే నాతలంపు. ఏలయన కోరి నంతమాత్రమున నాతనయున కాశీర్వాద పద్యములు పంపి నన్నోదార్చి దూరముననుండి తగు శ్రమవహించి లేఖలువ్రాయు మహాత్ములెవరు సిద్ధముగ నుందురు? ఇంత యనుగ్రహము నకుఁగారణము నాయందుఁగల నిర్వ్యాజకరుణయేకదా? సర్వదా శుభసూచకములు గలుగుటకు దీవించుట. పెద్దలధర్మము కదా? అంతమాత్రమున వాని ఫలితములకుఁ గర్తలు గారు కదా? ఆయువును వృద్ధిసేయలేరు కద. అదియునుంగాక నాఁడు నా "ఆరోగ్య శతకములు" ఫలవంతము లగుటకు నేను గారకుఁడనని గర్వించుట ధర్మమా? అట్టులే యీనాఁటి కార్యభంగమునకును మేమెవరము కర్తలము కాఁజాలము. విధి ననుసరించి కర్మల నాచరించుటయే మానవుల ధర్మము గాని దాని కర్తృత్వము వహించుట కధికారము లేదు. సర్వమునకును గర్త యా లీలావతారుండగు జగదీశ్వరుఁడే.

భగవంతుఁ డిట్టి కష్టదశలో నుంచినాఁడని నిందించుట తగదు. మహాత్ములట్టు లాచరించినను దేవుని కది ప్రియం బేయగు.

ఆ. "అలుకనైనఁ జెలిమినైనఁ గామంబున
నైన బాంధవముననైన భీతి
నైనఁ దగిలి తలఁప నఖిలాత్ముఁ డగు వానిఁ
జేరవచ్చు వేఱుసేయఁ డతఁడు."

క. "వైరానుబంధనంబునఁ
జేరిన చందనమునఁ విష్ణుఁ జిరతర భక్తిం

జేరఁగరాదని తోఁచును
నారాయణ భక్తియుక్తి నా చిత్తమునన్."

గర్భశోకముకన్న మానవుల దహింపఁ జేయునది వేఱొకటి లేదు. ఇట్టి కష్టంబులు మానవులకు వచ్చుట సహజముకదా? ధైర్య మిప్పుడే యుండవలయును. బంధు మిత్ర పుత్ర కళత్రాదులందఱును ఋణస్థులు. వారివారి ఋణములు తీఱిన వెనుక విడిపోవుదురు.

శా. "నీరాగారసి విష్టపాంధులక్రియన్ నిక్కంబు సంసార సం
చారుల్ వత్తురు గూడివిత్తురు సదా సంఘంబు లేదొక్కచో

... ...

...తద్వియోగమునకున్ శోకింప నీకేటికిన్."

"ఋణానుబంధరూపేణ పశుపత్ని సుతాదయః"

ఔషధము లేకను, అన్నము లేకను మానవులు మృతిఁజెందుట లేదు. ఆయువున్న నెట్టిప్రతిక్రియలు చేసినను సఫలములగును. "ప్రతీకారవిధాన మాయుషస్సతి శేషేహి ఫలాయకల్పతే."
ఏ సమయమున నే మానవుని కేది ఘటింపఁ జేయవలయునో యయ్యది దయ్యమెఱుంగు. ఏ వస్తువు; ఏ సమయమున నెట నుంచవలయునో యచటినుంచి సంరక్షించు భారమతనిదే.

శా. ఏ కాలంబున నే ప్రదేశమున నేయే సౌఖ్యముల్ దుఃఖముల్
లోకేశుండు లిఖించు మానవుల కాలోచించి యాస్యంబు లం
దా కాలంబున నా ప్రదేశమున నా యా సౌఖ్యముల్ దుఃఖముల్
రాకేలాగున మానుభీతివడికన్ రవ్వంతయున్ దప్పునే?

విధి ననుసరించి మానవులు బాల్య, యౌవన, కౌమార,
వార్ధక మరణావస్థ లన్నియును బొందకతీరదు. చేసికొన్న కర్మ
యనుభవింపక పోదు. ఈ శరీర సంబంధ మంతయును నంతము
కావలసినదే. దీనికై వగవం బనిలేదు. ఆపదలందున్న ధైర్య
మే ధైర్యము. అదియే మానవ లక్షణము.

శా. "అంతా సంశయమే శరీర ఘటనంబంతా విచారంబె, లో
నంతా దుఃఖపరంపరాన్వితమె మేనంతా భయభ్రాంతమే
అంతా నాంతశరీర శోషణమె దుర్వ్యాపారమే దేహికిన్
జింత న్నిన్నుఁ దలంచి పొందరు నరుల్ శ్రీకాళహస్తీశ్వరా!"

మ. "తనయుం డంచును దల్లి యంచు వరుసన్ దర్శింపనీ దేహముల్
జనునందాక నెయుండుఁగాని పిదపన్ సత్కృత్యదుష్కృత్యముల్
వెనువెంటంబడి వచ్చు దాని విధముల్ వేమాఱు యోజింపు మో
మనమా! యేల వృథాశ్రమంబు? కనుమా మాయాపహారిన్
హారిన్."

5/6/70

కావున నెట్టులైనను నాకెన్ని కష్టములు భగవంతుఁడు
కల్పించినను నేను వగవను గాని క్షణమందైనను నా నిశ్చల
భక్తి వానిపై విడకుండునట్లు చేసి చివఱకు నా కనుకూలమా
మేర్పఱచి, భగవత్సన్నిధానమునందు నన్నుంచి, తత్పాదార
దంబుల సేవించు భాగ్యంబు నాకిచ్చి నా జన్మము ధన్యముగఁ
జేయుటకై పరమేశ్వరుని బ్రార్థించుచుందును.

కాలము ననుసరించి ప్రకృతి ధర్మములు మాఱునట్లు కర్త
ననుసరించి ప్రకృతకార్య మీ విధముగ మార్పుఁ జెందినందు
లకు నింతగాధపించి వ్రాయవలసి వచ్చె.

రెండు వర్షముల ప్రాయము గల నా బాలుని కతమ్మున ప్రాయమించుకేనియుఁ గ్రైవాలకుండఁగనె, మనోధైర్యమిచ్చి, యింతనీతి గ్రహింపఁ జేసి, సంసారగతులనిత్యములనియు శ్రీహరిచరణాబ్జ సేవనంబె కర్తవ్యమనియు గట్టిగ నా మనమున నాటి నన్నుఁ జరితార్థునిగఁ జేసిన భగవల్లీలలు చిత్రింబులనుటలో సందేహమేమి? కావున నా సుతుఁడు నాచే నింత ప్రయత్నము చేయించి, పుణ్యకార్యము లొనరింపఁ జేసి, యావసాన దశలో మహాత్ములచే పద్యరూపమున దీవనలు బడసినందులకు, యీ పుణ్యకార్యము లన్నియు వాని యాత్మశాంతిఁ గలుగుటకై వినియోగించుననియు, ముందు నావంటి దరిద్రుని గర్భమునందుఁ గాక మహాపుణ్యాత్ముల గర్భమున నుదయించి సుఖించుననియు నేను నిశ్చయ బుద్ధితో నమ్ముచున్నాను.

మ. మనమా! కుండెను తాయి చేసికొని నైర్మల్యంబునుం గాంచి పు
త్రునకై జింతిలఁబోకుమింక నలపుత్రుల్ మిత్రులాప్తుల్ మఱిన్
ధనధాన్యంబులు నీటి బుగ్గలవలెన్ మాయంబులౌ నింతలో
గనుమా! శ్రీహరి పాదపద్మములు వేడ్కన్ బూజలన్ సల్పుచున్.

ఉ ప దే శ ము.

ఉ. పోయినవారికై వగవఁబోవనియేమి ? విషాదమొందుటల్
శ్రేయముగాదు ధైర్యమున చిత్తము దద్దయుఁ జిక్కఁబట్టుచున్
బాయుట ధర్మమాపదలు భద్రమొసంగెడు జ్ఞానమార్గమున్
బాయుట న్యాయమౌనె? మగువా! విలపింపఁగ రాదు దీనికై. 1

చ. వగచిన లాభమేమి? తనువా నశియించును భోగభాగ్యముల్
జగతిని నీటిబుగ్గలను సంగతి నీ వెఱుఁగంగరానిదో ?
సుగములభింపనుబ్బుటయు శోకముఁ జెందెడు వేళఁ గుందుటల్
తగదు వివేకులేనెడు పథంబిది కాదు వచింపనేటికిన్. 2

మ. తరుణీ! యేటికి నేడ్చుచుండెదవు చింతల్ గాంచి నిస్వేదుచున్
బరలోకమ్మున నున్న బాలునకునై భావ్యంబె శోకింప ? ని
ద్ధర నధ్యాత్మ రహస్యతత్వకలనాధర్మంబులన్ నేర్చి మో
క్షరతిన్ గాంచఁగ యత్నమూనుమిఁక సాంఖ్యంబైన యో
గంబునన్. 3

ఉ. ఏటికి దుఃఖమొందెదవు; యేగిన పుత్రునకై తపించి యా
రాటముఁ జెందఁబోకుమ నిరంతర మిట్టుల నేడ్చుచుండి న
మాటల నాలకింపుమిఁక మానిని! ధైర్యముఁ జిక్కఁబట్టుమా
దాటఁగ వచ్చునే విధివిధానము నేరికినైన నిద్ధరన్ ? 4

గీ. భువి నశాశ్వత మనఁదగు పుత్రమిత్ర
బాంధవ కళత్రములకయి వగచుచుండి
యా పరమజగదీశ పాదారవింద
భజనసేవ నాసక్తి వీడ్వంగఁదగునె ? 5

ఉ. ఆపదలెన్ని చుట్టుకొని యంతము లేక దహింపఁ జేసినన్
దాపముఁ జెందరాదు నిజధర్మముఁ బాయఁగరాదు భక్తిదీ
క్షాపరతంత్రులై సకల కారణకారణ భూతుఁడైన యా
శ్రీపరమేశ పాదయుగసేవ లొనర్పఁగ మోక్షమబ్బెడిన్. 6

గీ. ఎంత శాస్త్ర పరిజ్ఞాన మెసఁగియున్న
ధర్మనీతి ప్రబోధలఁ దఱచియున్న
సార్థకంబైన వైరాగ్య మబ్బకున్న
నాపదల నెట్టఁగాఁ దరమౌనె? కాంత! 7

చ. కలిగిన యంతలోన నుపకారము సేయుచు దీర్థయాత్రలన్
సలుపుచు భక్తకోటుల కజస్రము భక్తిగ సేవఁ జేయుచున్
మెలకువగాంచుచున్ హృదయనీరజమందు రమేశు పాదముల్
నిలుపుచుఁ గొల్చుచున్ భువిని నెట్టుటధర్మము కాలమీఁగలిన్. 8

చ. వినయముఁ గాంచి పెద్దలనఁ బేర్మివహించి సధర్మపద్ధతుల్
పనివడిబట్టి దీనజనబాంధవులన్ దరిఁజేర్చి వారలన్
దనుపుచు దేవదేవుని పదమ్ము క్షణమ్మునైన బాయకుం
డినఁదుదిస్వర్గలోకమున నెట్టనఁగాంతురు సర్వసౌఖ్యముల్. 9

. మానవ జన్మమబ్బెనని మాటలు వేయి వచింప నేటికో
మానవతీలలామ! పరమంబగు మోక్షముఁ గాంచు పద్ధతుల్
మానకబట్టి జీవితములన్ వృథఁబుచ్చక జ్ఞానమార్గ దీ
క్షానియతిన్ జరించిన సుఖస్థితి కల్గును నిందునందునన్. 10

ఉ. జ్ఞానముఁ గల్గినందులకు కాలము వ్యర్థము సేయఁబోక యీ
మానవలోక భోగముల మగ్గక నస్థిరమైన వాంఛలన్

యూని తదేక నిష్ఠఁగొని యూన్యులఁగొల్చుచు దేవదేవునిన్
బూనినుతించినన్ గలుగు మోక్షమునిందుననందునన్ దుదిన్.11

ఉ. వీరిని వారినిఁ గొలిచి వెఱ్ఱితనంబున దానసార సం
సారగతుల్ స్థిరంబు లని స్వాంతములోఁ దలఁపోసి జీవితం
బూరక గెంటుచుంటబుధులొప్పెదు కార్యముగాదు దైవమున్
వారక గొల్చినన్ గలుగవా? సురలోకనివాససౌఖ్యముల్ .12

గీ. ఇది సనాతన ధర్మము ; యిది యజ్ఞాన
మార్గ మిది యనీతిపథము మానవులకు
నిట్టి సూక్ష్మ బోధ లెఱుఁగ నట్టి మూఢు
లరయ నిందు నందున భ్రష్టులౌదు రెపుడు.   13

